క్లుప్తంగా

మా పొట్ట కొట్టిన కాంగ్రెస్ పార్టీ



హన్మకొండ: కాంగ్రెస్ పార్టీ మా పొట్ట కొట్టిందని ఆటోడ్రైవర్ తెలిపాడు. మంగళవారం హనుమకొండ చౌరాస్తా మీదుగా ప్రయాణిస్తున్న క్రమంలో అశోక కూడలిలో సిగ్నల్ పడడంతో బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ వాహనం నిలిచిపోయింది. ఇదే సమయంలో ఈ వాహనం పక్కన నిలిచి ఉన్న ఆటో కనిపించగా ఆటోడ్రైవర్ స్వామితో వినయ్‌భాస్కర్ ముచ్చటించారు. వీరి మధ్య సంభాషణ ఆసక్తిగా జరిగింది. వినయ్ భాస్కర్ ఆటో బాగా నడుస్తుందా.. గిరాకీ బాగుందా అని స్వామిని అడుగగా మహిళలకు ఫ్రీ బస్సు ప్రయాణం కల్పించడంతో పరిస్థితి ఘోరంగా తయారైంది... ఓటు ఎటు వేస్తారని వినయ్‌భాస్కర్ అడుగగా బీఆర్ఎస్‌కు వేస్తాం... ఆటోవాళ్లు అందరు వేస్తారా అని అడుగగా బీఆర్ఎస్‌కు వేయకపోతే వేస్ట్ అని డ్రైవర్ స్వామి అన్నారు. మా పార్టీ వారు వచ్చి చెప్పకున్నా వేస్తారా అనగా తప్పకు వేస్తామన్నాడు.

ఎమ్మెల్సీగా పోటీచేసే అవకాశం కల్పించాలి



కాజీపేట: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ పక్షాన పోటీచేసే అవకాశాన్ని ఇప్పించాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు వినతిపత్రం సమర్పించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో సంఘం బాధ్యులు బుట్టి శ్యామ్ యాదవ్, పాక శ్రీనివాస్‌తో కలిసి పోటీలో ఉండడం వల్ల గెలిచే అవకాశాలను వివరించారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డితో ఎమ్మెల్సీ అభ్యర్థిత్వంపై కృష్ణయ్య మాట్లాడగా సానుకూలంగా స్పందించారని కేదారి యాదవ్ తెలిపారు.

ఆర్థికసాయం

వరంగల్ : భూపాలపల్లిలో పనిచేస్తున్న ప్రైవేట్ ఉపాధ్యాయుడు రామకృష్ణకు రూ.5వేలు ఆర్థిక సాయం మంగళవారం అందించినట్లు ప్రభుత్వ ఉపాధ్యాయుడు, సామాజిక సేవకుడు గజ్జెల సుమన్ తెలిపారు. 3 నెలల క్రితం వెన్నెముక సమస్యతో బాధపడుతుండగా ఎంజీఎం ఆస్పత్రికి వెళ్లి వారం రోజులు చికిత్స పొందాడు. కొన్ని నెలల నుంచి స్కూల్‌కి వెళ్లలేదు. అటు జీతం రాక ఇటు ఆరోగ్యం బాగాలేక ఇబ్బందుల్లో ఉన్న విషయం తెలుసుకుని యువనేతాజీ ఫౌండేషన్ ద్వారా సేకరించి ఆర్థిక సాయం అందిచినట్లు సుమన్ తెలిపారు.

పోస్టల్‌బ్యాలెట్‌కు బారులు

పరకాల : వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా పరకాల నియోజకవర్గంలో 772 మందికి పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవగా 225 మంది ఓటుహక్కు వినియోగించుకున్నట్లు ఆర్డీఓ నారాయణ తెలిపారు. పోలీస్ బందోబస్తు మధ్య పోస్టల్‌బ్యాలెట్ ఓటింగ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు.

వర్షంతో కాస్త ఉపశమనం

- కరుణించిన వరుణుడు
- గాలిదుమారంతో వాన
- విరిగిన విద్యుత్ స్తంభం తప్పిన పెను ప్రమాదం.. ఊపిరిపీల్చుకున్న ప్రజలు



నగరంలో కురుస్తున్న వర్షం

ఖిలా వరంగల్: ఎండలు మండుతున్న తరుణంలో ఒక్కసారిగా మంగళవారం సాయంత్రం గాలిదుమారంతో పాటు వర్షం కురవడంతో ప్రజలకు కాస్త ఉపశమనం కలిగింది. దీంతో ప్రజలు ఒక్కసారిగా ఎండవేడిమి నుంచి ఊపిరిపీల్చుకున్నారు. వరంగల్‌లో ఉదయం 45 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండగా సాయంత్రం 4 గంటల నుంచి వరకు ఆకాశం మోఘావృతమైంది. అనంతరం గాలిదుమారం, ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. జనం ఎండ వేడి నుంచి ఉపశమనం పొందినప్పటికీ గాలిదుమారంతో నగర వీధులన్నీ అతులాకుతులమైంది. షాపులకు పెట్టిన బోర్డులు రోడ్డుపై ఎగిరిపడ్డాయి. 39వ డివిజన్ లక్ష్మీనగర్‌లో విద్యుత్ స్తంభం విరిగిపడింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే విద్యుత్ అధికారులు ఘటన స్థలానికి చేరుకుని విద్యుత్ సరఫరాను నిలిపివేసి మరమ్మతులు చేపట్టారు. రాత్రి 8 గంటలకు అధికారులు సరఫరాను పునరుద్ధరించారు. ఏదిఏమైనా అకాలవర్షంతో నగర ప్రజలు ఎండి వేడి నుంచి ఉపశమనం పొందారు.

కాశిబుగ్గ: నగరంలో మంగళవారం సాయంత్రం పడిన అకాల వర్షంతో అతలాకుతలమైంది. గాలివానతో పలు ప్రాంతాల్లో చెట్లకొమ్మలు విరిగి పడడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. సరఫరా నిలిచిపోవడంతో వరంగల్ బస్టాండ్ ప్రాంతంలో అంధకారం నెలకొంది. వర్షం పడడంతో తాత్కాలిక బస్టాండ్‌లో నీళ్లు నిలిచిపోవడం, విద్యుత్ లేకపోవడంతో ప్రయాణికులు బస్సులు ఎక్కే క్రమంలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నగరంలోని పలు కాలనీల్లో నీరు నిలవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి కార్నర్ మీటింగ్ పోచమ్మమైదాన్‌లో పెట్టడంతో జంక్షన్‌లలో ట్రాఫిక్ ఆంక్షలు పెట్టడంతో ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు.



హనుమకొండలో ..





నగరంలో కురుస్తున్న వానలో వెళ్తున్న ఆటో, ద్విచక్ర వాహనదారుడు

బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలి

- హనుమకొండ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్‌భాస్కర్



హన్మకొండ : నీటిని పట్టుకుంటున్న స్థానికులతో ముచ్చటిస్తున్న వినయ్ భాస్కర్

హన్మకొండ : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గతంలో ఎన్నడూ లేని విధంగా తాగు నీటిఎద్దడి నెలకొందని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. మంగళవారం హనుమకొండ అలంకార్ ప్రాంతంలో బీఆర్ఎస్ అభ్యర్థి మారపల్లి సుధీర్‌కుమార్ గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలో వాటర్‌ట్యాంక్ కనిపించడంతో స్థానికులతో ఆయన ముచ్చటించారు. నీటి సమస్యను తెలుసుకున్నారు. గతంలో తమకు నీటి సమస్య లేదని ఇప్పుడు సమస్య వచ్చిందని, కేసీఆర్ పాలనలోనే బాగుండేనని స్థానికులు చెప్పారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ గత పదేళ్లలో నగరంలో నీటి ఎద్దడి లేకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే అన్ని సమస్యలు నెలకొంటున్నాయని విమర్శించారు. కనీసం తాగునీటి సరఫరా చేయలేని పరిస్థితిలో ప్రభుత్వముందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



హన్మకొండ చౌరస్తా : చిరువ్యాపారికి కరపత్రం ద్వారా ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మచిలీబజార్‌లో బీఆర్ఎస్ ప్రచారం

హన్మకొండ చౌరస్తా: బీఆర్ఎస్ పార్టీ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్ కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరుతూ నగరంలోని 10వ డివిజన్‌లో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ఆదేశాలతో పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజనీకాంత్ ఆధ్వర్యంలో కరపత్రాలు పంచుతూ డివిజన్‌లోని 11 పోలింగ్ బూత్‌ల్లో ప్రచారం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ ఉడుతుల సారంగపాణి, మహ్మద్ ఖలీల్, పులి హరికృష్ణ, వెంకన్న, రవీందర్, గోపికృష్ణ, భరత్, రాజేష్, కృష్ణ పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో ఒకరి రిమాండ్

ఖిలా వరంగల్: కొనుగోలుదారులకు భూమిపత్రాలు ఇవ్వకుండా.. అదనపు డబ్బులు ఇవ్వాలని వేధింపులు, అడగబోతే చంపుతానని బెదిరింపులకు పాల్పడుతున్న ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. ఆయన కథనం ప్రకారం..రంగశాయిపేట రాంగోపాలపురానికి చెందిన దోమ రమేష్‌కు శంభునిపేట నాగేంద్రనగర్ కాలనీలో 625.86 గజాల స్థలంలో సామిల్ మిల్లు ఉంది. హనుమకొండ వికాస్‌నగర్‌కు చెందిన ప్రతాపగిరి గోవర్ధన్ రెండేళ్ల క్రితం రమేశ్‌కు కొన్ని డబ్బులు చెల్లించి సామిల్ మిల్లుతో పాటు 625.86 గజాల స్థలాన్ని కొనుగోలు అగ్రిమెంట్ చేసుకున్నాడు. గోవర్ధన్ మధ్యవర్తిగా వ్యవహరించి రమేష్‌కు చెందిన స్థలాన్ని రూ.2.36 కోట్లకు ప్రతాపగిరి స్వేత ధనలక్ష్మికి మే 2023లో విక్రయించి రిజిస్ట్రేషన్ చేశారు. కొనుగోలు చేసి ఏడాది గడిచినా కొనుగోలు చేసి స్థలం మీదకు పోనివ్వకుండా ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ చేతికి ఇవ్వకుండా..అడగబోతే చంపుతానని గోవర్ధన్ కొనుగోలుదారురాలైన స్వేత ధనలక్ష్మిని బెదిరింపులకు పాల్పడుతున్నాడు. గోవర్ధన్ పెట్టే బెదిరింపులకు భయాందోళనలకు గురైన స్వేత ధనలక్ష్మీ మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. గోవర్ధన్‌పై చీటింగ్ కేసు నమోదు చేసి మంగళవారం కోర్టులో హాజరు పర్చగా జడ్జి ఆదేశాలతో ప్రతాపగిరి గోవర్ధన్‌ను పరకాల సబ్‌జైలుకు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

సీఎంకు మడికొండలో ఘన స్వాగతం

మడికొండ: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటన సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆధ్వర్యంలో మడికొండ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవత్‌రెడ్డికి ఘనస్వాగతం పలికారు. అలాగే రేవంత్‌రెడ్డి వివాహ వార్షికోత్సవం సందర్భంగా కాజీపేట మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో చౌరస్తాలో కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పైడిపాల రఘు చందర్, బైరి లింగమూర్తి, కుర్ల మో హన్, బిల్ల రవీందర్, గుర్ర అమర్‌నాథ్, నర్మెట వెంకటరమణగౌడ్, వేణు గౌడ్, వస్కుల శంకర్, భాస్కర్, నాగరాజు, ఎడబోయిన ప్రభాకర్, వస్కుల శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ ఎంపీ స్థానం బీజేపీదే

కాజీపేట/మడికొండ : ప్రజలు మోదీ ముచ్చటగా మూడోసారి ప్రధానమంత్రి కావాలనే ఆకాంక్షలో ఉన్న నేపథ్యంలో వరంగల్ లోక్‌సభ స్థానం బీజేపీ గెల్చుకుని తీరుతుందని అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలోని ఆయన స్వగృహంలో 46వ డివిజన్ మడికొండకు చెందిన బీఆర్ఎస్ నాయకులు మంగళవారం రాజీనామా చేసి బీజేపీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బీఆర్ఎస్ డివిజన్ కార్యదర్శి పల్లపు కుమార్‌స్వామి, వడ్డెర సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లపు మల్లికార్జున్, కుమార్‌రాజాతో పాటు మరో 50 మంది పార్టీలో చేరారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు పానగోటి వెంకట్‌రావు, రాజేష్‌రెడ్డి, వినోద్, కుమార్‌బాబు, కరుణాకర్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



కాజీపేట : పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న రమేశ్

కడియం కావ్యకు టీఎమ్మార్పీఎస్ మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న బొట్ల భిక్షపతి

హన్మకొండ: కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యకు తెలంగాణ ఎమ్మార్పీఎస్ మద్దతు ఇస్తుందని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ల భిక్షపతి మాదిగ తెలిపారు. మంగళవారం హనుమకొండలో టీ ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్లలో బీజేపీ పేదలకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. బడా వ్యాపారవేత్తలకు పెద్దపీట వేశారన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించలేదన్నారు. పేదవర్గాలను దోచిన మోదీ ఫాసిస్టు పాలనకు చమరగీతం పాడాలని పిలుపునిచ్చారు. కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో రఘు,ఏలియా, దీపక్, ప్రణయ్, సామ్యేల్, సునిల్ పాల్గొన్నారు.

పదేళ్ల మోదీ పాలనను ప్రశ్నించండి



ఏఐవైఎఫ్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యువజన సంఘం బాధ్యులు

- ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వలీఉల్లా ఖాద్రీ

హన్మకొండ చౌరస్తా : పదేళ్ల కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ సర్కార్ నిరంకుశ, అప్రజాస్వామిక పాలన, అవినీతిని ప్రశ్నించదని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వలీఉల్లా ఖాద్రీ యువతకు పిలుపునిచ్చారు. హనుమకొండలోని అశోకా హోటల్ ఆవరణలో మంగళవారం మోడీ సర్కార్ వైఫల్యాలను ఎండగడుతూ రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రధాని మోదీ ఆర్థిక విధానాలతో కార్పొరేట్ శక్తులు బిలియనీర్లుగా మారారని, మళ్లీ బీజేపీ కేంద్రంలో అధికారంలోకి రాకుండా ప్రజలు చిత్తుగా ఓడించాలని కోరారు. వరంగల్ ఎంపీగా డాక్టర్ కావ్యను గెలిపించాలని కోరారు. ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సతీష్, ఎల్లా పవన్, బన్నీ, అనిల్, సుధాకర్, అశోక్ పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన వారికి బహుమతులు

విద్యారణ్యపురి : ఎఫ్‌సెట్‌కు ప్రిపేర్‌అయ్యే విద్యార్థులకు ఇటీవలనే హనుమకొండలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మోడల్ టెస్టును నిర్వహించారు. ఈ టెస్టులో ప్రతిభ కనపర్చిన వారికి టీచర్స్ కాలనీలోని ఎస్సార్ కళాశాలలో అభినందన సభ ఏర్పాటు చేసి మంగళవారం ఆయా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ ప్రతి ఏడాది మోడల్ ఎంసెట్, నీట్ అలాగే జేఈఈ ఇతర పోటీపరీక్షల మోడల్ టెస్టును నిర్వహిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం కూడా ఎఫ్‌సెట్ మోడల్ టెస్టును నిర్వహించామన్నారు. మొదటి ర్యాంకు సాధించిన బుడిగ పాక కీర్తికి, రెండో ర్యాంకు సాధించిన యువరాజును సన్మానించినట్లు తెలిపారు. వీరికి మహనీయుల పుస్తకాలను అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సార్ కళాశాల ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ అధ్యక్షుడు సాయికిరణ్, ఉపాధ్యక్షుడు జస్వంత్ విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబర్చిన విద్యార్థిని సన్మానించి అభినందిస్తున్న ఎస్ఎఫ్ఐ బాధ్యులు

మధ్య వయస్సు వారికే స్పాండిలైటీస్



ప్లకార్డులతో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సరేశ్

కాజీపేట అర్బన్ : యాంకలైజింగ్ స్పాండలైటీస్ వ్యాధి ఎక్కువగా మధ్య వయస్సు వాళ్లకు, మగవారికి ఎక్కువగా వస్తుందని రుమటాలజిస్ట్ డాక్టర్ నరేష్ తెలిపారు. హన్మకొండ బీఈడీ కళాశాల ఎదురుగా ఉన్న నరేష్ రుమటాలటీ సెంటర్‌లో మంగళవారం ప్రపంచ యాంకలైజింగ్ స్పాండిలైటీస్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేష్ ప్లకార్డులతో యాంకలైజింగ్ స్పాండిలైటీస్‌పై అవగాహన కల్పించి మాట్లాడారు. ఉదయం సమయంలో నడుము, మెడ నొప్పులు ఉంటాయని, కీళ్లనొప్పులు, వాపులు, బిగుసుకుపోవడం లక్షణాలు కనిపిస్తాయని అన్నారు. వ్యాధితో బాధపడే వారు కీళ్ల వైద్య నిపుణులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని తద్వారా వ్యాధి నివారణకు వైద్యం తోడ్పడుతుందని అన్నారు.

కరీమాబాద్‌లో కోతుల పట్టివేత

ఖిలా వరంగల్ : వరంగల్ 40వ డివిజన్ కరీమాబాద్ వీధుల్లో గత కొంత కాలంగా కో తులు హల్‌చల్ చేస్తున్నాయి. స్థానిక ప్రజలు చేతిలో కర్రలేకుండా బయటకు రాలేదని పరిస్థితి నెలకొంది. డోర్ తీస్తే ఇంట్లోకి కోతులు ప్రవేశించి నిత్యావసర సరుకులను చిందర వందర చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ప్రజలు స్థానిక కార్పొరేటర్ మరుపల్లి రవిని కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన కార్పొరేటర్ మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కోతులను పట్టి నగరానికి దూరంగా తరలించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఉర్సుగుట్టకు ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్‌ను తొలగించాలని, ఎండలకు చెత్తకు నిప్పు అంటుకుని మంటలు ఎగిసిపడ్డాయని చెప్పారు. డంపింగ్ పక్కనే కోట్ల విలువైన టాటాకార్ల షోరూం ఉందని, స్థానిక ప్రజల ఇళ్లు ఉన్నాయని, వెంటనే అధికారులు పరిశీలించి డంపింగ్ యార్డ్‌ను తరలించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బల్దియా సిబ్బంది పాల్గొన్నారు.



కోతులను చూపిస్తున్న కార్పొరేటర్ రవి

కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

హసన్‌పర్తి : కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు అన్నారు. నగరంలోని 55వ డివిజన్ భీమారానికి చెందిన వివిధ పార్టీ నాయకుల, కార్యకర్తలు మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. కార్పొరేటర్ జక్కుల రజిత ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించాలన్నారు. కలిసికట్టుగా పనిచేస్తూ డివిజన్‌లో భారీ మెజారిటీ తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్‌నర్సింహారెడ్డి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడబు సంగాల ప్రేమ్‌కుమార్, సీనియర్ నాయకులు సురేందర్‌గౌడ్, గోవర్ధన్ పాల్గొన్నారు.



కాజీపట రూరల్: ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

బాపూజీనగర్‌లో ఇంటింటి ప్రచారం

కాజీపేట రూరల్ : బాపూజీనగర్‌లో మంగళవారం కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీని ప్రధానమంతి చేయడమే లక్ష్యంగా తెలంగాణ స్టేట్ ఆయిల్ సీడ్స్, గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి ఆదేశానుసారం కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 47వ డివిజన్ కాంగ్రెస్ నాయకుడు సందెల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఇమ్మడి బాబు, కాసర్ల నాగేష్, సురేందర్, రాజిరెడ్డి, రమేష్, అర్చన, కృప, వంశీ, మున్నా, రవి పాల్గొన్నారు.

మోడల్ పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలి

పరకాల : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గుర్తించిన మోడల్ పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగ పద్మజ అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లపై ఆమె మంగళవారం స్థానిక రెవెన్యూ, మున్సిపల్, మండల పరిషత్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు, తహసీల్దార్ భాస్కర్, మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహ పాల్గొన్నారు.

ఫణి సేవాదళ్ ఆధ్వర్యంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న ఫణి సేవాదళ్ సభ్యులు

వరంగల్: అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని నిర్వాహకులు బొడ్ల రవీంద్ర నాథ్ తెలిపారు. అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం ఫణి సేవాదళ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరంగల్ శ్రీ భద్రకాళి దేవాలయ అర్చి వద్ద నారాయణ(అన్న ప్రసాద)సేవ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. ఫణి సేవాదళ్ ఆధ్వర్యంలో ఆరు సంవత్సరాల నుంచి ప్రతి అమావాస్య రోజు అన్న ప్రసాద సేవ చేస్తున్నట్లు తెలిపారు. ఫణి సేవాదళ్ నలుగురు మిత్రులతో ప్రారంభించామని ఇప్పుడు 60మంది సభ్యులతో ప్రతి నెల నిర్వహిస్తున్నమన్నారు. ఈ ఎండాకాలం పాపయ్యపేట చమన్ వద్ద బాటసారులకోసం చలి వేంద్రం కూడా ఏర్పాటు చేశామని చెప్పారు. ఈకార్యక్రమంలో పబ్బతి సత్యనారాయణ, పడిశాల సుజాత, రాచర్ల శ్రీనివాస్, పార్శి కిశోర్, హర్ష తదితరులు పాల్గొన్నారు.